క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మచిలీపట్నంటౌన్: ఎన్‌గొల్లపాలెంలోని భగవాన్ శ్రీకృష్ణ, సరస్వతి మాత దేవాలయాల్లో శిలా విగ్రహాలు, ధ్వజస్తంభాల ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను, కరపత్రాలను ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) తన నివాసంలో గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 31వ తేదీ ఉదయం 8.16 గంటలకు విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, ఆలయ భక్త కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఈ ఏపీ సెట్ పరీక్ష

పెడన: మండలంలోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నాలుగో రోజు ఈ ఏపీ సెట్ -2023 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గురువారం ఉదయం సెషన్‌లో 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 130 మందికి 128 మంది, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 130 మందికి 127 మంది హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ బీఆర్ఎస్‌రెడ్డి, పరీక్షా కేంద్రం అడ్మిన్ పి. అశోక్‌కుమార్ తెలిపారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి

పెడన ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్బారావు



పెడన: లబ్ధిదారులు ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని పెడన ఇన్‌చార్జి ఎంపీడీఓ డి. సుబ్బారావు అన్నారు. ఉరివి గ్రామ సచివాలయం పరిధిలోని హౌసింగ్ లబ్ధిదారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్థలాలు ఇచ్చి చాలా రోజులు అయిన నేపథ్యంలో పునాదులు కూడా వేయని వారు తక్షణం ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఎవరైనా కాంట్రాక్టరు వస్తే వారికి పనులు అప్పగించి తమ ఇళ్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీటీసీ గంధం విజయలక్ష్మి, సర్పంచ్ సురేష్, హౌసింగ్ ఏఈ మాధవి, పంచాయతీ కార్యదర్శి అహ్మద్ , వైఎస్సార్ సీపీ నాయకులు గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా, పుస్తక పఠనంలో శిక్షణ



అవనిగడ్డ: వేసవి శిక్షణలో భాగంగా స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా, పుస్తకపఠనం, కథలు చెప్పడంలో శిక్షణ ఇచ్చారు. స్థానిక ఫారెస్ట్ అధికారి ఏఎల్ అరుణ కుమారి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి జె. ప్రభుదాస్ పర్యవేక్షించారు.

సర్పంచ్‌పై కేసు నమోదు

పెడన: మండలంలోని నందిగామ సర్పంచ్ బొడ్డు చినబాబుపై పెడన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చోడవరం గ్రామానికి చెందిన చినబాబు సమీప బంధువు బొడ్డు పద్మను రెండేళ్ల కిందట రూ.లక్ష రుణం అడిగాడు. నగదు లేకపోవడంతో బంగారు ఆభరణాన్ని సర్పంచికి ఇచ్చి తనఖా పెట్టుకోవాలని సూచించింది. రెండేళ్లు పూర్తయినా ఆభరణాన్ని తిరిగి ఇవ్వకపోవడంతో పలుమార్లు సర్పంచ్‌ను పద్మ ప్రశ్నించింది. అయినా స్పందన లేకపోగా తనపై దౌర్జన్యానికి సర్పంచ్ చినబాబు పాల్పడ్డాడని పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 ఎకరాల గడ్డివామి దగ్ధం



పెడన: ఉరివి గ్రామంలో కె. దుర్గారావుకు చెందిన 15 ఎకరాల గడ్డివామి గురువారం ఉదయం దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు రూ. 2 లక్షల వరకు నష్టం జరిగింది. కావాలని తన గడ్డివామిని ఎవరో తగులబెట్టారని, ఆరు నెలల కిందట కూడా తన పశువుల చావిడిని తగులబెట్టడంతో ఆ ప్రమాదంలో రెండు గేదెలు మృతిచెందాయని దుర్గారావు వాపోయాడు.

సీఎం సభకు చకచకా ఏర్పాట్లు



సభా ప్రాంగణంలో జరుగుతున్న పనులు



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని

- 22న బందరు పోర్టు పనుల ప్రారంభం
- పరిశీలించిన ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: జిల్లా ప్రజల చిరకాల వాంఛ బందరు పోర్టు పనులను ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా నగరంలోని సర్కారుతోట స్విమ్మింగ్ పూల్ పక్కనున్న భారత స్కాట్స్ అండ్ గైడ్స్ స్థలంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. నగర సమీపంలోని తపసిపూడి సముద్ర తీరాన గంగమ్మ తల్లికి హారతులు ఇచ్చి పోర్టు పనులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)తో కలిసి ప్రారంభించనున్నారు. అనంతరం ఇక్కడ జరిగే బహిరంగ సభకు విచ్చేసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ బహిరంగ సభ నిర్వహణకు సంబంధించి ప్రస్తుతం సభా ప్రాంగణానికి హాజరయ్యే ప్రజలకు ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు టెంట్లు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు కూడా చేరాయి. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఎయిర్‌కూలర్లు, తాగునీరు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పనులను స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, పలువురు కార్పొరేటర్లు పరిశీలించారు.

పోర్టు నిర్మాణాన్ని స్వాగతిస్తున్నాం: సీపీఎం

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 22వ తేదీన బందరు పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించడాన్ని తమ పార్టీ స్వాగతిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. నగరంలోని బుట్టాయిపేట సీపీఎం కార్యాలయంలో గురువారం పోర్టు నిర్మాణ పనుల ప్రారంభ నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మచిలీపట్నంతో పాటు కృష్ణా జిల్లా ప్రజల చిరకాల వాంఛగా ఉన్న పోర్టు నిర్మాణానికి తమ పార్టీ మద్దతు తెలుపుతోందన్నారు. పోర్టు నిర్మాణంతో కృష్ణా జిల్లా సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. పోర్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన ఏక్‌సాల్ లీజుదారుల కుటుంబాల వారికి పోర్టు నిర్మాణ పనుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, పోర్టు నిర్మాణ గ్రామాల్లో ప్రజలకు సివిల్ పనులతో పాటు నిర్మాణ పనుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. పోలినాయుడు, జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కేవీ గోపాలరావు, సీఐటీయూ నగర కార్యదర్శి జయరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. గురువారం సాయంత్రం సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి. రాజాబాబు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఆయన పలు అంశాలపై చర్చించారు.

ఓటరు నమోదులో వచ్చిన అభ్యంతరాలు, కొత్తగా నమోదైన ఓటు కార్డుల పంపిణీ, ఎన్నికల సమయంలో నగదు, ఇతర వస్తువులు పట్టుబడినప్పుడు అనుసరించాల్సిన పద్ధతులు, విధివిధానాలపై ఆయన చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, దిశ డీఎస్పీ యు. నాగరాజు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శివాజీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో ఎన్నో ప్రయోజనాలు

జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి పార్థసారథి



కూరగాయల పంటను పరిశీలిస్తున్న పార్థసారథి, శివప్రసాద్ తదితరులు

కోనేరుసెంటర్: ప్రకృతి సాగుతో రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి కె. పార్థసారథి అన్నారు. బందరు మండలం నెలకుర్రు పంచాయతీ పరిధిలోని గొల్లపాలెంకు చెందిన రైతు గోరిపర్తి వీరవెంకట్రావు తన పొలంలో వేసవిలో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో కూరగాయల సాగు చేస్తూ లబ్ధి పొందుతున్నాడు. జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి పార్థసారథి మండల వ్యవసాయాధికారి జీవీ శివప్రసాద్‌తో కలిసి గురువారం వెంకట్రావు పొలాన్ని సందర్శించారు. రైతు వెంకట్రావును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ రైతులు వేసవిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల సాగు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా నేలలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందడంతో పాటు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం నేలకు పెరుగుతుందన్నారు. రైతు వెంకట్రావు మాట్లాడుతూ ఐదేళ్లుగా ఘన జీవామృతం, నవ ధాన్యాలు సాగు చేస్తున్నామని చెప్పాడు. ఈ ఏడాది కూరగాయలు పండించడంతో పాటు పశువుల మేత కోసం జొన్న, పిల్లిపెసర వేశానని చెప్పాడు. తద్వారా రోజుకు రూ. 1000 వరకు ఆదాయం లభిస్తుందన్నాడు. పండించిన కూరగాయలను పొలం వద్దనే విక్రయిస్తూ లబ్ధి పొందుతున్నానని వివరించారు.

దిశ యాప్‌తో ఎన్నో ప్రయోజనాలు

వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు అవగాహన

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల రక్షణకు ఎన్నో కార్యక్రమాలు రూపొందించారని నగరంలోని 48, 26 డివిజన్లకు చెందిన మహిళా పోలీసులు ఎస్. మాధవి, జాన్‌బెహన్ అన్నారు. వాటిలో దిశ యాప్ సమాచారం, దిశ పోలీస్ స్టేషన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం గురువారం 11వ రోజుకు చేరుకుంది. వారు మాట్లాడుతూ దిశ యాప్, దిశ పోలీస్‌స్టేషన్ల వల్ల మహిళలకు కలుగుతున్న ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. సెల్‌ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో ఎస్ఓఎస్ టచ్ చేయాలన్నారు. ఈ సమాచారం సమీపంలోని దిశ పోలీస్ స్టేషన్‌కు చేరుతుందని, వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని ఆపదలో ఉన్న వారిని రక్షిస్తారని చెప్పారు. అలాగే గృహ హింసకు సంబంధించి మహిళలకు మహిళా పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరుగుతుందన్నారు. చిన్నారులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. హనుమజ్జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ ప్రశంసాపత్రాలను అందజేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న శాఖ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించారు.

రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



మోపిదేవికి వినతిపత్రం అందిస్తున్న వెంకటేశ్వరరావు

అవనిగడ్డ: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ కాలనీలో రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణను వారు గురువారం కలిశారు. కాలనీలో రహదారుల అభివృద్ధికి ఎంపీ నిధులు మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో మండలి వెంకటేశ్వరరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీ తీర్మానం మేరకే రోడ్డు విస్తరణ

నాగాయలంక: పంచాయతీ తీర్మానం మేరకే శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లో రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తున్నారని నాగాయలంక ఉప సర్పంచి తలశిల వెంకట నరసింహారావు (నాని), మరో 11 మంది పంచాయతీ పాలకవర్గ సభ్యులు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ అధికారులపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాన్ని వారు ఖండించారు. గ్రామ పంచాయతీలోని ఆర్.ఎస్ నంబర్ 149, 151లో హైకోర్టు ఉత్తర్వుల నడుమ ఈనెల 16న ఉన్నతాధికారుల సూచనల మేరకు పోలీసు రక్షణతో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశారన్నారు. దీనితో ఏవిధమైన సంబంధం లేని అక్కడ గుడి కడుతున్న గడ్డిపాటి నాగేశ్వరరావు, మరికొందరు పంచాయతీ అధికారి, ఉద్యోగులకు ఆటంకం కలిగించి విధులను అడ్డుకోవడంతో పోలీసులు వారిని అదుపులోనికి తీసుకున్నారు తప్ప దీనిలో ఎవరి ప్రమేయం లేదని వివరించారు. శ్రీరామ పాదక్షేత్రం అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొందరు వ్యక్తులు మాజీ సర్పంచ్ మండవ బాలవర్ధిరావు లాంటి గ్రామ అభివృద్ధి కాముకులపై నిందలు వేస్తున్నారని, దేవాలయ ఆస్తులు ధ్వంసం అంటూ ప్రచారం చేస్తున్నారని చెప్పారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసిన అధికారులు, ఉద్యోగులపై ముడుపులు తీసున్నారని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.

నూతన అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం



అడ్మిషన్ పత్రాలను తల్లిదండ్రులకు అందిస్తున్న ఉపాధ్యాయుడు నాగభూషణం

కోడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెంచేందుకు ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం ఇళ్ల బాట పట్టారు. ఎంఈఓ టీవీఎం రామదాసు పర్యవేక్షణలో విద్యా కోర్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు నూతన అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. గురువారం కోడూరులో ఈ ప్రచారాన్ని నిర్వహించారు. కోడూరు ప్రాథమికోన్నత పాఠశాలను జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో దీనిపై కూడా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలతో పాటు కోడూరు ప్రధాన సెంటర్‌లోనే మరో జెడ్పీ పాఠశాలకు అవకాశం లభించడంతో అప్‌గ్రేడ్ చెందిన పాఠశాలలో తొమ్మిది, పది తరగతుల్లో తమ పిల్లలకు నూతన అడ్మిషన్లు తీసుకునేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపుతున్నారు. కోడూరు జెడ్పీ పాఠశాలకు సంబంధించి రెండు రోజుల్లో 40 కొత్త అడ్మిషన్లను నమోదు చేశామని ఉపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం తెలిపారు. ఇప్పటికే పాఠశాలలో 340 మంది విద్యార్థులు ఉన్నారని, ఈ ఏడాది ఆ సంఖ్యను 500లకు పెంచేందుకు ప్రణాళిక రూపొందించి అవగాహన కల్పిస్తున్నామని నాగభూషణం తెలిపారు.

రూ.81 వేలకు అభయాంజనేయ స్వామి లడ్డూ వేలం



కృత్తివెన్ను: హనుమజ్జయంతి ఉత్సవాలు మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు 13 కిలోల స్వామి వారి లడ్డూకు వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన చిటికినేని సాంబశివరావు (శ్రీను) రూ.81 వేలకు పాడి లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సాంబశివరావును కమిటీ నిర్వాహకులు సత్కరించారు. ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పిన్నింటి మహేష్, బండ్రెడ్డి రామకృష్ణ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

మరిన్ని విజయాలు సాధించాలి

అనురాధకు మెప్మా అధికారుల సన్మానం



అనురాధను సన్మానిస్తున్న విశాలాక్షి తదితరులు

పెడన: పురపాలక సంఘ పరిధిలో మెప్మా విభాగంలో 18వ వార్డు రిసోర్స్‌పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్న బండారు అనురాధ పరుగులో మరిన్ని విజయాలు సాధించాలని మెప్మా పీడీ విజయలక్ష్మి అన్నారు. పరుగుల అనురాధగా గుర్తింపు తెచ్చుకుని అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడంతో ఆమెను మెప్మా ఉన్నతాధికారులు గురువారం సన్మానించారు. విజయవాడ గుణదలలో మెప్మాలోని ఆర్పీలకు మెప్మా కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. విశాలాక్షి మాట్లాడుతూ అనురాధ మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐబీ సుధారాణి, ఎల్‌హెచ్ సత్యవతి, బీఎల్ రాధా తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి

చల్లపల్లి: రాష్ట్రానికి కీలకమైన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి, పునరావాసాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు సక్రమంగా ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి కోరారు. గురువారం సాయంత్రం స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో లంక భూముల పోరాట యోధుడు దివంగత మాలెంపాటి బాల భాస్కరరావు శత జయంతి సభ జరిగింది. ముఖ్య వక్త సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై బాల భాస్కరరావు స్ఫూర్తితో పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, విశాఖ సహకార బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి టి.తాతయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు దేవభక్తుని నిర్మల మాట్లాడారు. ఈ సందర్భంగా బాల భాస్కరరావు జీవిత చరిత్ర పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతే ధ్యేయం

పామర్రు: పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ పనిచేస్తోందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. పామర్రు పాల శీతల కేంద్రం పరిధిలోని సాలెంపాలెం సొసైటీ సభ్యులు గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాడిరైతు సంక్షేమం మన మతం-అలుపెరగని సేవ మన అభిమతం అనే కార్యక్రమంలో భాగంగా పాల సొసైటీలను సందర్శిస్తున్నామని చెప్పారు. యూనియన్ ద్వారా సబ్సిడీలపై అందజేస్తున్న దాణా, తెలగపిండి, గడ్డి జాతి మొక్కలు తదితరాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బోర్డు డైరెక్టర్ వి.సాయి వెంకట రమణ, ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లు మల్లికార్జునరావు, బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, పాల శీతల కేంద్రం మేనేజర్ గోపీనాథ్, సంఘ అధ్యక్షులు నాగ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం



ఆర్ఆర్ఆర్ స్కీం ప్రారంభిస్తున్నట్లు తెలుపుతున్న కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడ టౌన్: త్వరలో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాలను పట్టణంలో ఏర్పాటు చేస్తామని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆర్ఆర్ఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూచనలతో పట్టణంలోని రాజేంద్రనగర్, ఎన్టీఆర్ కాలనీ, ముగ్గుబజార్, ఇందిరానగర్ కాలనీ, యానాదుల కాలనీ, కోతిబొమ్మ సెంటర్, చెంచుపేట, మందపాడు, పాత మున్సిపల్ కార్యాలయం, రాయల అప్పారావు వీధి తదితర 10 ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న పాత దుస్తులు, పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులు, చెప్పులను ఈ కేంద్రాలకు అందజేస్తే వాటి అవసరం ఉన్న వారికి అందిస్తామన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టి.వి. రంగారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేసే వారికి సముచిత స్థానం



చల్లపల్లి: అంకితభావంతో పనిచేసే వారికి వైఎస్సార్ సీపీ సముచిత స్థానం కల్పిస్తోందని షేక్ దిల్‌షాద్ నజరానా నియామకం మరోసారి రుజువు చేసిందని జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి అన్నారు. గ్రామానికి చెందిన షేక్ దిల్‌షాద్ నజరానా రాష్ట్ర ఉర్దూ అకాడమీ పాలక మండలికి నూతన సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం నజరానాను హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, జెడ్పీటీసీ కల్యాణి ఆధ్వర్యంలో సన్మానించారు. వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు జీవన్ జ్యోతి చెక్కు అందజేత

మండవల్లి: తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్ సహజ మరణం చెందడంతో అతని భార్య నాగరాణికి సర్పంచ్ చేబ్రోలు సుధారాణి చేతుల మీదుగా పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన పథకం చెక్కును మండవల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బి.దుర్గారావు గురువారం అందజేశారు. తక్కెళ్లపాడులో గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి రూ.2 లక్షల చెక్కును అందజేయడం అభినందనీయమని సర్పంచ్ సుధారాణి, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు.

గ్రామ ప్రముఖుడు సీహెచ్ మాశిలామణి, ఫిషర్మన్ సొసైటీ అధ్యక్షుడు దాసరి ప్రసాద్, ఉప సర్పంచ్ ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

పర్చూరి సోమేశ్వరరావుకు నివాళి

అవనిగడ్డ: కమ్యూనిస్టు నాయకుడు, మాజీ సర్పంచ్ దివంగత పర్చూరి సోమేశ్వరరావు 23వ వర్ధంతి కార్యక్రమం గురువారం స్థానిక ఎస్‌బీకే భవనంలో జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ సోమేశ్వరరావు సేవలను కొనియాడారు. బీజేపీ మతాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. బీజేపీని గద్దె దించేందుకు మేధావులు, కమ్యూనిస్టులు అందరూ ఏకతాటి పైకి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. న్యాయవాది పర్చూరి రాఘవేంద్రరావు, లిబరేషన్ పార్టీ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి డి. హరనాథ్, మారుబోయిన పులేంద్రరావు, పి. సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

ముదినేపల్లి రూరల్ : మండలంలోని అన్నవరం డ్రెయిన్‌పై ఏర్పాటు చేస్తున్న ప్రత్యామ్నాయ రహదారి పనులను ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ముదినేపల్లి నుంచి దేవరం వెళ్లేందుకు అన్నవరం డ్రెయిన్ వంతెన శిథిలావస్థకు చేరి ఇటీవల కూలిపోయింది. దీంతో దేవరం, ముదినేపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిషత్ నిధులతో డ్రెయిన్‌లో తూములు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనులను ఎంపీపీ సత్యనారాయణ పరిశీలించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) వంతెన నిర్మాణ ఆవశ్యకతను కలెక్టర్‌కు తెలియజేసి రూ.81 లక్షలతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, మండల కో - ఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షు, నాయకులు శీలం రామకృష్ణ, బత్తిన కిషోర్, రాచూరి కుమార్, పేర్ని పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, పెడన విజయానంద డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ట్రైనీ ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలబ్రిటీ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి 20వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పెడనలోని విజయానంద డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. బీఎస్సీ (కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 91212 26708, 94404 44033 నంబర్లను సంప్రదించాలని కోరారు.

25 పంచాయతీల్లో ఉపాధి పనులు

పామర్రు: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఎం పోలురాజు గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 25 గ్రామ పంచాయతీల్లో మొత్తం 3,252 మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారన్నారు. నిమ్మకూరు, పసుమర్రు, ఐనంపూడిలో చెరువు అభివృద్ధి పనులు, గట్లు పటిష్ట పరిచే పనులు జరుగుతున్నాయన్నారు. అన్ని గ్రామాల పరిధిలో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా జరుగుతున్నాయని వివరించారు.